

బకాసురుని వధిస్తూ...

ఎండమబ్బుల పగటివేళ బంగారు కాంతుల కల్పవక్షం ఎక్కి ఊరేగిన స్వామి.. చల్లని రాత్రి సర్వభూపాల వాహనాధీశుడై మాడవీధుల్లో విహరించాడు. బకాసుర వధ అవతారంలో దేవేరులతో కలసి ఊరేగిన స్వామిని భక్తజనం కనులారా చూసి తరించారు.



తిరుమల బ్రహ్మోత్సవాలలో అత్యంత కీలక ఘట్టం నేడు. అనేక ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో పాటూ స్థానికులు పెద్ద సంఖ్యలో హాజరయ్యే వేడుక గరుడోత్సవం. ఒకవైపు వెంకన్న వేడుకను కనులారా చూడాలని తండోపతండాలుగా వస్తున్న జనం.. మరోవైపు ఏ ఆటంకం లేకుండా వాహనసేవ జరగాలని కోరుకుంటున్న టీటీడీ.. ఎండతో మబ్బులు దోబూచులాడుతున్న వేళ గరుడోత్సవానికి సకల ఏర్పాట్లు పూర్తయ్యాయి.

- భక్తుల సంఖ్య 3 లక్షలు దాటొచ్చని అంచనా
- శనివారం నుంచే నిండిపోయిన గ్యాలరీలు
- టీటీడీ భారీ ఏర్పాట్లు
- తిరుపతి, తిరుమలల్లో పార్కింగ్‌కు ఏర్పాట్లు

నేడు గరుడసేవ

పెరిగిన భద్రత

గరుడోత్సవంలో పోలీసు సిబ్బంది : 4500

టీటీడీ విజిలెన్స్ అండ్ సెక్యూరిటీ సిబ్బంది: 1600

సీసీ కెమెరాలు : 3000

తిరుపతి/తిరుమల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి)

శ్రీవారి గరుడసేవకు 3 లక్షల మంది భక్తులు తరలివస్తారని టీటీడీ అంచనా వేస్తోంది. ఇప్పటి దాకా గరిష్ఠంగా 2.60 లక్షల నుంచీ 2.70 లక్షల మంది వరకూ గరుడసేవకు హాజరు కాగా ఈసారి గరుడ సేవ ఆదివారం రావడం, ముందురోజు శనివారం కావడంతో ఈ సంఖ్య పెరగవచ్చని భావిస్తున్నారు. దానికనుగుణంగా టీటీడీ యంత్రాంగం భారీ ఏర్పాట్లు చేపట్టింది.

కొండపై 4 వేల కార్లకే అనుమతి

తిరుమలలో పార్కింగ్ సమస్య కారణంగా గరిష్ఠంగా 4 వేల వాహనాలను మాత్రమే అనుమతించనున్నారు. 2023లో 3 వేల వాహనాలకు పార్కింగ్ సదుపాయం కల్పించగా గతేడాది 3500 వాహనాలకు పార్కింగ్ సౌకర్యం కల్పించారు. నేటి ఉదయం నుంచే ప్రైవేటు వాహనాలైన జీపులు, కార్లు వంటి వాటిని కొండపైకి అనుమతించే అవకాశం వుండదు. కేవలం వీఐపీలు ప్రయాణించే వాహనాలను మాత్రమే అనుమతించనున్నారు. తిరుమలలో 20 చోట్ల వాహనాల పార్కింగ్‌కు ఏర్పాట్లు చేశారు.

29 ఉదయం దాకా బైక్‌లకు అనుమతి లేదు!

శనివారం రాత్రి 9 గంటల నుంచీ సోమవారం ఉదయం 6 గంటల దాకా తిరుపతి నుంచీ తిరుమలకు ద్విచక్ర వాహనాలను అనుమతించడం లేదు.

కొండపైకి ఆర్టీసీ బస్సులోనే వెళ్లాలి

తిరుపతి నుంచి తిరుమలకు ఆదివారం ఉదయం నుంచీ సోమవారం ఉదయం దాకా కేవలం ఆర్టీసీ బస్సులకు మాత్రమే అనుమతి వుంటుంది. గరుడసేవకు 425 ఆర్టీసీ బస్సులు నడవనున్నాయి. శనివారం రాత్రి నుంచీ సోమవారం ఉదయం దాకా 3125 ట్రిప్పులు తిరగడం ద్వారా 2.30 లక్షల మంది భక్తులను చేరవేస్తాయని అంచనా. తిరుపతి రైల్వే స్టేషన్, ప్రధాన బస్టాండు, తిరుచానూరు, ఎమ్మార్‌పల్లి, జూపార్కు, మంగళం, రేణిగుంట రైల్వే స్టేషన్‌ల నుంచీ ఆర్టీసీ బస్సులు తిరుమలకు నడుస్తాయి.

శ్రీవారిమెట్టు దారిలో నడవచ్చు

గరుడసేవ కారణంగా భక్తుల రద్దీని తట్టుకునేందుకు శ్రీవారి మెట్టు మార్గాన్ని ఆదివారం ఉదయం నుంచీ సోమవారం ఉదయం దాకా 24 గంటలూ తెరిచివుంచాలని టీటీడీ నిర్ణయించింది. సాధారణంగా ఉదయం 6 గంటల నుంచీ సాయంత్రం 6 గంటల వరకూ మాత్రమే అనుమతి ఉంటుంది.

తిరుపతిలో పార్కింగ్ ఇక్కడ

- కడప, శ్రీకాళహస్తి మార్గాల నుంచీ వచ్చే టూ వీలర్లు, ఫోర్ వీలర్లు ఇస్కాన్, నెహ్రూ మున్సిపల్ హైస్కూలు, భారతీయ విద్యా భవన్ గ్రౌండ్స్‌లో పార్క్ చేయడానికి ఏర్పాట్లు చేశారు.
- చిత్తూరు, పీలేరు మార్గాల నుంచీ వచ్చే టెంపో ట్రావెలర్ బస్సులు, టూరిస్టు బస్సులకు దేవలోక్ వద్ద పార్కింగ్ సదుపాయం కల్పించారు.
- మదనపల్లె, చిత్తూరుల వైపు నుంచీ వచ్చే ఫోర్ వీలర్లు, టూ వీలర్లకు భారతీయ విద్యా భవన్, నెహ్రూ మున్సిపల్ స్కూలు, ఇస్కాన్ గ్రౌండ్స్‌లో పార్కింగ్ సదుపాయం కల్పించారు. ఇవన్నీ నిండిపోతే చెర్లోపల్లి, వకుళ మాత ఆలయాల వద్ద కూడా పార్కింగ్ ఏర్పాటు చేస్తున్నారు.
- పుత్తూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు మ్యాంగో మార్కెట్ ఆవరణలో పార్కింగ్ సౌకర్యం కల్పించారు.
- మదనపల్లె, పీలేరు మార్గాల నుంచీ వచ్చే ఆర్టీసీ బస్సులు కాలూరు క్రాస్, ఆర్సీపురం క్రాస్, తనపల్లి క్రాస్, గరుడ ఫ్లైఓవర్ మీదుగా బస్టాండుకు చేరుకోవాల్సి వుంటుంది.

మాడవీధుల్లో కార్నర్ పాయింట్లు

మాడవీధుల్లో గ్యాలరీల సామర్థ్యం 1.90 లక్షల మంది. ఈసారి మాడవీధుల్లోని కార్నర్ పాయింట్లుగా అన్నదానం, మేదరమిట్ట, అనంతాళ్వార్ తోట, సుపథం తదితర నాలుగు చోట్ల క్యూలైన్లను అధికారులు పొడిగించారు. రద్దీ ఏర్పడితే ఈ పాయింట్ల వద్ద అరగంట పాటు దర్శనం పొడిగిస్తే దాదాపుగా అందరికీ శ్రీవారి దర్శనం లభించినట్టు అవుతుందని అధికారులు భావిస్తున్నారు.

నిరంతరాయంగా అన్నపానీయాలు

భక్తులు శనివారం రాత్రి నుంచే మాడవీధుల్లోని గ్యాలరీల్లో బైఠాయించారు. సోమవారం ఉదయం వరకూ మాడవీధుల్లోని 190 గ్యాలరీలలో అన్న పానీయాలు నిరంతరం సరఫరా చేసేందుకు టీటీడీ ఏర్పాట్లు చేసింది. సాంబారు అన్నం, పెరుగన్నం, ఉప్మా, సుండలు (ఉడికించిన శెనగలు), పాలు, మజ్జిగ, తాగునీటి బాటిళ్ళు భక్తులకు అందజేయనుంది. గ్యాలరీలకు చేరువలోనే టాయిలెట్లు కూడా ఏర్పాటు చేశారు. సోమవారం ఉదయం వరకూ ఏకంగా నాలుగు లక్షల మందికి సరిపడా భోజన ఏర్పాట్లు జరుగుతున్నాయి. రోజువారీ తయారు చేసే 3 లక్షల లడ్డూలకు అదనంగా మరో లక్ష లడ్డూలు తయారు చేసి అందుబాటులో వుంచారు మరోవైపు కొండమీద తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రాన్ని కూడా 24 గంటలూ తెరిచి వుంచుతారు.

దసరా కానుక

ఆటోమిత్ర ద్వారా 7200 మందికి లబ్ధి

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు దసరా పండుగ కానుక అందనుంది. కూటమి ప్రభుత్వం గత నెల 15న స్త్రీ శక్తి పథకం పేరిట మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణ పథకం ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ పథకం వల్ల తమకు ఆదాయం తగ్గుతుందని ఆటో డ్రైవర్లు ఆందోళన పడ్డారు. వారిని కూడా ఆదుకుంటామని అప్పట్లో సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వం వాహన మిత్ర పథకం పేరుతో రూ.10 వేలు అందించింది. కాగా సీఎం చంద్రబాబు ఆటో మిత్ర పథకం పేరుతో మరో రూ.5 వేలు పెంచి రూ.15 వేల వంతున దసరా కానుకగా అందిస్తామని ప్రకటించారు. ఆటో, మ్యాక్సీ క్యాబ్ యజమానులు ఈ పథకానికి అర్హులు. గతంలో జిల్లాలో ఈ పథకానికి 6600 మంది అర్హులుగా ఉన్నారు. కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి ప్రభుత్వం ఈ నెల 17 నుంచి 19 వరకు గడువు ఇచ్చింది. దీంతో ఇప్పటి వరకు కొత్తగా మరో 600 మంది ఆటో డ్రైవర్లు ఈ పథకానికి దరఖాస్తు చేసుకున్నారు. దీంతో మొత్తం జిల్లాలో 7200 మందికి రూ.1.08 కోట్ల లబ్ది చేకూరనుంది.

125మంది హమాలీలకు పెరిగిన బోనస్, కూలీ రేట్లు, దుస్తులు

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాల సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే మండలస్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్లలో రెగ్యులర్‌గా విధులు నిర్వహిస్తున్న హమాలీలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. దసరా పండుగ కానుకగా మిఠాయిలు, దుస్తులు, బోనస్, పెరిగిన కూలీ రేట్లు అందించనుంది. చిత్తూరు జిల్లాలో 14 ఎంఎల్ఎస్ పాయింట్లలో 125 మంది రెగ్యులర్ హమాలీలు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను లారీలకు నింపడం, దించడం చేస్తున్నారు. వీరందరికీ ప్రభుత్వం ప్రకటించిన మిఠాయిలు, దుస్తులు, బోనస్, పెరిగిన కూలీ రేట్లను దసరాకు అందించనున్నట్లు జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్ లక్ష్మి తెలిపారు. బోనస్, స్వీట్లు ఏడాదికోసారి ప్రభుత్వం ఇస్తుందన్నారు. కూలీ రేట్లు క్వింటాల్‌కు రూ.25 నుంచి రూ.28కి పెంచారన్నారు. బోనస్ రూ.6వేల నుంచి రూ.6500కు, స్వీట్లు ధర రూ.1300నుంచి రూ.1500కు, దుస్తులు రెండు జతల నుంచి మూడు జతలకు పెంచడం జరిగిందని, ప్రభుత్వ అనుమతి రాగానే పండుగ రోజు హమాలీలకు అందజేస్తామని ఆమె చెప్పారు.



ఐదు మండలాల్లో వర్షం

చిత్తూరుకలెక్టరేట్,సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): అల్పపీడన ద్రోణి ప్రభావంతో జిల్లాలోని ఐదు మండలాల్లో తేలిక పాటి వర్షం కురిసింది. మండలాలవారీగా.. సోమలలో 18.6, గుడిపాలలో 12.4, పూతలపట్టులో 5.4, రొంపిచెర్లలో 5, పెనుమూరులో 1.2 మి.మీ వర్షపాతం నమోదైంది.

పీవీకేఎన్‌లో పీజీ స్పాట్ అడ్మిషన్లు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరులోని పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి పీజీలో స్పాట్ అడ్మిషన్లు ఇస్తున్నట్లు ప్రిన్సిపాల్ జీవనజ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో సంబంధిత సబ్జెక్టుల్లో ఓసీ, బీసీలు 55 శాతం, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 50 శాతం ఉత్తీర్ణత సాధించి ఉండాలన్నారు. వివరాలకు 99859 57572, 97037 99970 నెంబర్లను సంప్రదించాలన్నారు.


కూరగాయల అలంకరణలో గంగమ్మ


సరస్వతి దేవి అలంకారంలో చిత్తూరు గిరింపేటలోని దుర్గమ్మ

శాకాంబరీదేవి అలంకారంలో బోయకొండ గంగమ్మ

చౌడేపల్లె, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండలో జరుగుతున్న దసరా మహోత్సవాల్లో శనివారం శాకాంబరీదేవి అలంకారంలో గంగమ్మ దర్శనమిచ్చారు. ఒక చేతిలో త్రిశూలం, మరో చేతిలో ఢమరుకం, ఇంకో చేతిలో ఖడ్గం, మరో చేతిలో అక్షయ పాత్రతో గంగమ్మను అలంకరించారు. క్యారట్, టమోటా, క్యాప్సీకం, మిరప, బెండ, వంకాయ, బీన్స్, కీర, మొక్కజొన్న, పొట్లకాయలు, గుమ్మడి, నిమ్మకాయలతో ప్రత్యేకంగా శాకాంబరీదేవిగా అలంకరించి ధూప, దీప, నైవేద్యం సమర్పించారు.

48 పీహెచ్‌సీలు... 53 కాన్పులు
ఒక్క కాన్పు కూడా జరగనివి 22
వైద్యశాఖ అధికారులపై కలెక్టర్ సీరియస్

ఓటరు జాబితా సమగ్ర పరిశీలన ప్రారంభం

తిరుమల పాదయాత్రలో విషాదం
- ట్రాక్టర్ కిందపడి మేస్త్రి మృతి

9లో




శోభాయమానం స్నపన తిరుమజనం



తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): శనివారం మధ్యాహ్నం రంగనాయక మండపంలో శ్రీవారి ఉత్సవమూర్తులకు స్నపన తిరుమజనం శోభాయమానంగా నిర్వహించారు. బాదం, పిస్తా, వట్టివేరు, పసుపు కొమ్ములు, ఎండుద్రాక్షా, యాలకులు, తులసి, రోజామాలలతో పాటు ఈసారి ప్రత్యేకంగా కుంకుమ పువ్వు మాలలు, కిరీటాలతో శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామిని అలంకరించారు.

కాశ్మీర్ కుంకుమపువ్వుతో మాలలు

కాశ్మీర్ నుంచి తీసుకువచ్చిన మూడు కేజీల కుంకుమ పువ్వుతో చెన్నైకు చెందిన నిపుణులు మాలలు, కిరీటాలు తయారు చేశారు. వీటి విలువ రూ.6 లక్షలు. అలాగే కురువేరు, తామరపువ్వులతో తయారు చేసిన మాలలుప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. చెన్నైకు చెందిన రాజేంద్రన్, షణ్ముక సుందరం, బాలసుబ్రహణ్యం గత కొన్నేళ్లుగా ప్రతి స్నపన తిరుమంజనం రోజున ఎనిమిది సెట్ల మాలలు, కిరీటాలను అందస్తున్నారని గార్డెన్ సూపరిటెండెంట్ శ్రీనివాసులు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. రంగనాయక మండపాన్ని కూడా పలు రకాల పండ్లు, పుష్పాలతో అలంకరించారు. ఇందులో 25 వేల తామరపువ్వులు, 5 వేల కట్ రోజా పువ్వులు ఉన్నాయి.



చిత్రం: జి.గాయత్రీదేవి

దేవదేవుడినే పతిగా చేసుకున్న
గోదాదేవి

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రతి ఉదయం సుప్రభాతంతో మేల్కొలిపితే, ధనుర్మాసంలో మాత్రం తిరుప్పావై పఠించి అర్చిస్తారు. ముప్పయి పాశురాల తిరుప్పావై మూలద్రావిడంలో గోదాదేవి గానం చేసిన గీతాలు. శ్రీరంగంలోని పూలతోటలో విష్ణుచిత్తులకు లభించిన కుమార్తె గోదాదేవి. రోజూ పూలు కోసి మాలఅల్లి శ్రీరంగనాథుడికి ఈమె వేసేది. ఆ మాలను ముందుగా తన మెడలో ధరించి బావుందని సంతృప్తి పడిన తర్వాతే స్వామికి అలంకరించేది. ఇది అపచారమని విష్ణుచిత్తుడు భావించినా స్వామి మాత్రం ఆమె మాలతో పాటూ గోదాదేవినీ స్వీకరించాడని చెబుతారు. అందుకే గోదాదేవి పుట్టిన శ్రీవిల్లిపుత్తూరులో ఆండాళ్ అలంకరించుకున్న పూల మాలను ఏటా తిరుమలకు తీసుకువచ్చి శ్రీనివాసుడికి అలంకరిస్తారు. దేవదేవుడినే పతిగా భావించిన మహా భక్తురాలిగా గోదాదేవిని కొలుస్తారు.

సేవింతురే!

కలియుగ వెంకటేశ్వరుని వాహన సేవల్లో కళా బృందాల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. శనివారంనాటి కల్పవృక్ష వాహన సేవలో కళాకారుల ప్రదర్శనలు అద్భుతంగా సాగాయి. మహారాష్ట్రకు చెందిన 111 మంది కళాకారుల డ్రమ్ము విన్యాసాలు కట్టిపడేశాయి. తెలంగాణా కళాకారుల జానపద నృత్యం, కోయ నృత్యం, ఒడిస్సా కళాకారుల దల్కాయ్, జానపద నృత్యం, గుజరాత్ కళాకారుల దాకలదుడియ, రాజస్థాన్ కళాకారుల దాండియా, ఉత్తరాఖండ్ కళాకారుల చోలియా వంటి ప్రదర్శనలు భక్తజనరంజకంగా నిలిచాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన కూచిపూడి, దశావతరాలు, చెక్కభజన, డప్పు నృత్యం, కోలాటం ఆకట్టుకున్నాయి. రాత్రి సర్వభూపాల వాహనసేవలోనూ సాంస్కృతిక ప్రదర్శనలతో భక్తులు పరవశించిపోయారు.

– తిరుమల(కల్చరల్), ఆంధ్రజ్యోతి

సాంస్కృతిక వైభవం



ఎటు చూసినా భక్తజనమే

● ముందురోజే గరుడోత్సవ రద్దీ



అక్టోపస్ వద్ద సర్వదర్శన భక్తుల రద్దీ

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. గరుడ వాహనం ముందు రోజే రద్దీగా మారింది. పెరటాసి మాసం రెండో శనివారం కూడా తోడవ్వడంతో భక్తసంద్రంగా దర్శనమిస్తోంది. మధ్యాహ్నానికే మాడవీధుల గ్యాలరీలన్నీ నిండిపోయాయి. మూలవిరాట్టు దర్శనానికి వెళ్లాలంటే 3 కిలోమీటర్ల క్యూలైన్ కనిపిస్తోంది. మరోపక్క వాహనాల ఆంక్షలు అమలవుతున్నాయి. రింగురోడ్డు వరకే అనుమతిస్తున్నారు. ప్రతి వాహనాన్ని పార్కింగ్‌కు తరలిస్తున్నారు. ఆదివారం విధులు నిర్వహించాల్సిన సిబ్బందిని శనివారం రాత్రి నుంచే తీసుకున్నారు. ఎస్పీ సుబ్బరాయుడు, సీవీఎస్వో మురళీకృష్ణ శనివారం రాత్రి తనిఖీలు చేపట్టి విధుల్లోని భద్రతాధికారులు, సిబ్బందిని అప్రమత్తం చేశారు.



అక్టోపస్ భవనం సర్కిల్ నుంచి భక్తులను పీఏసీ5కి తరలింపు

వెంకన్న భక్తులకు వృక్షప్రసాదం



బ్రహ్మోత్సవాల్లో భక్తులకు 'వృక్షప్రసాదం' పేరుతో తులసి మొక్కలను టీటీడీ ఫారెస్టు విభాగం పంపిణీ చేస్తోంది. తమిళనాడులోని తిరుచ్చారాపల్లికి చెందిన తులసిట్రస్టు టీటీడీకి 2.50 లక్షల తులసి మొక్కలను విరాళంగా అందజేసింది. శ్రీవారి దర్శనం, వాహన దర్శనం పూర్తిచేసుకుని తిరుగు ప్రయాణమయ్యేవారికి వీటిని రాంభగీచా, జీఎన్సీ, బాలాజీ బస్టాండ్, అక్టోపస్ భవనం సర్కిల్ ప్రాంతాల్లో అందజేస్తున్నారు. రోజుకు 25 వేల చొప్పున ఇప్పటికే 75 వేల మొక్కలను పంచారు.

తిరుమల చేరిన గోదాదేవి మాలలు





గరుడ సేవలో ఆదివారం శ్రీవారికి అలంకరించడానికి తమిళనాడులోని శ్రీవిల్లిపుత్తూరు నుంచి గోదాదేవి మాలలు తిరుమలకు చేరుకున్నాయి. బేడి ఆంజనేయ స్వామి ఆలయం వద్దగల పెద్దజీయర్ మఠంలో ఈ మాలలకు పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. తిరుమాడవీధులలో ఊరేగింపుగా శ్రీవారి ఆలయంలోకి తీసుకెళ్లారు. శ్రీవిల్లిపుత్తూరులో గోదాదేవికి ధరింపజేసిన మాలలను గరుడ సేవలో శ్రీవారికి అలంకరించడం ఆనవాయితీ. శ్రీవల్లిపుత్తూరుకు చెందిన రెండు కుటుంబాల పూల తయారీదారులు ఈ మాలలు సమర్పిస్తున్నారు. తమిళనాడు దేవదాయశాఖ జాయింట్ సెక్రటరీ మారియప్పన్, ఈవో చక్కరై అమ్మాళ్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథం, శ్రీవిల్లి పుత్తూరు ఆలయ స్థానాచార్యులు రమేష్ రంగరాజన్ పాల్గొన్నారు.

– తిరుమల, ఆంధ్రజ్యోతి

బ్రహ్మోత్సవాలలో నేడు | **ఉదయం:** 8-10మధ్య మోహినీ అవతారం
రాత్రి: 6.30 నుంచి గరుడసేవ

ఐదు మున్సిపాల్టీలకు మార్గదర్శిగా కార్పొరేషన్

● స్వచ్ఛ సెహర్ జోడి ద్వారా ఒప్పందం



ఒప్పంద పత్రాలు చూపుతున్న పలు కార్పొరేషన్ల కమిషనర్లు

తిరుపతి, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఐదు మున్సిపాల్టీల్లో మెరుగైన పారిశుధ్య నిర్వహణకు తిరుపతి నగరపాలక సంస్థ మార్గదర్శకం వహించనుంది. ఈక్రమంలో శనివారం కుప్పం, మడకశిర, మైదుకూరు, కమలాపురం, జమ్మలమడుగు మున్సిపాలిటీలు 'స్వచ్ఛ సెహర్ జోడి' కింద నగరపాలక సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నాయి. చిన్న మున్సిపాలిటీల్లో పారిశుధ్యంలో మెరుగైన ఫలితాలు సాధించేలా సహకరిస్తామని కమిషనర్ మౌర్య చెప్పారు. 'స్వచ్ఛ సెహర్ జోడి' పథకం కింద అభివృద్ధి చెందిన నగరాలు మరి కొన్నింటిని అభివృద్ధి చేస్తాయన్నారు. తూకివాకం వద్ద చెత్త నిర్వహణ కేంద్రాన్ని కమిషనర్లు పరిశీలించారు. డిప్యూటీ కమిషనర్ అమరయ్య, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, వివిధ మున్సిపాలిటీల కమిషనర్లు పాల్గొన్నారు.

నేడు తిరుమలకు నిమిషానికో బస్సు

తిరుపతి(ఆర్టీసీ), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ఆదివారం గరుడ సేవ సందర్భంగా నిమిషానికో బస్సు నడపనున్నట్లు ప్రజారవాణాధికారి జగదీష్ శనివారం తెలిపారు. చెన్నై, కాంచీపురం, తిరుత్తణి, వేలూరు, బెంగళూరు తదితర ప్రాంతాలకు రెండు రోజుల పాటు బస్సులు రద్దు చేశామన్నారు. ఎలక్ట్రిక్ సహా మొత్తం 425 బస్సులు.. తిరుపతి- తిరుమల మధ్య తిరుగుతాయన్నారు. 3,125ట్రిప్పులతో 2.3లక్షల మందికి ప్రయాణ ఏర్పాట్లు చేశామన్నారు. మామిడికాయల మార్కెట్, చెర్లోపల్లె సమీపంలోని హైవే, దేవలోక్, భారతీయ విద్యాభవన్, కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కాలేజీ గ్రౌండ్ ప్రాంతాల నుంచి బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు. ఆదివారం సాయంత్రం 7గంటలకు తిరుమలలో రాంభగీచ బస్టాండు వద్ద వంద బస్సులు నిల్వ ఉంచుతామన్నారు.

ఐఐటీలో నిర్మాణాలకు రూ.1250 కోట్లు

● మొదటి విడత ఫేజ్ బీ పనులకు వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన ప్రధాని మోదీ



ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ, కలెక్టర్ తదితరులు

ఏర్పేడు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఏర్పేడు సమీపంలోని తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో రూ.1250 కోట్లతో మొదటి విడత 'ఫేజ్ బీ' నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. దేశవ్యాప్తంగా 8 ఐఐటీలలో రూ.11 వేలతో చేపట్టే అభివృద్ధి పనులకు శనివారం ఒడిశాలోని జార్సిగూడ నుంచి ప్రధానమంత్రి నరేంద్రమోదీ వర్చువల్‌గా శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ పనులను నాలుగేళ్లలో పూర్తి చేయనున్నారు. తిరుపతి ఐఐటీ క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో ఎంపీ గురుమూర్తి మాట్లాడుతూ, ఇది భవనాల నిర్మాణమే కాదని, యువత ఉజ్వల భవిష్యత్తు నిర్మాణమన్నారు. మామిడి, టమోటా రైతులకు ఉపయోగపడేలా ఆహార ప్రాసెస్‌రంగంపైనా ఐఐటీ దృష్టి సారించడం వ్యవసాయ రంగానికి శుభపరిణామమన్నారు. ఈ ఫేజ్ బీలో మూడు అకాడమిక్స్ బ్లాక్స్, ఒక మెగా ఇండోర్ ఆడిటోరియం, ఒక ఓపెన్ ఎయిర్ ఆడిటోరియం, రెసిడెన్షియల్, స్పోర్ట్స్ విభాగ సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని కలెక్టర్ వెంకటేశ్వర్ చెప్పారు. ఇవి విద్యార్థులు, అధ్యాపకులు, శాస్త్రవేత్తలు, పరిశోధనలకు ఎంతో ఉపయోగంగా ఉంటాయని చెప్పారు. డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ నాయకత్వంలో సమాజానికి ఈ ఐఐటీ పెద్ద ముందడుగు వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీడబ్ల్యూడీ ప్రాజెక్టు ఇన్‌ఛార్జి, చీఫ్ ఇంజనీర్ కం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బీఎస్ రెడ్డి, ఇన్‌ఛార్జి డైరెక్టర్ మురళీకృష్ణ, రిజిస్ట్రార్ కృష్ణ మోహన్, డీన్లు, ఫ్యాకల్టీ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

'పర్యాటకం'లో జిల్లాకు మరోసారి అవార్డు

● సీఎం చంద్రబాబు నుంచి పురస్కారం అందుకున్న కలెక్టర్



సీఎం నుంచి అవార్డు అందుకుంటున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్న జిల్లాగా తిరుపతిని గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం వరుసగా రెండోసారి అవార్డుకు ఎంపిక చేసింది. విజయవాడ ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో 'బెస్ట్ డిస్ట్రిక్ట్ ప్రమోటింగ్ టూరిజం ఇన్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటేశ్వర్ సీఎం చంద్రబబు నుంచి అవార్డు అందుకున్నారు. వారసత్వ, ఆధ్యాత్మిక కళలు, కోస్టల్ అగ్రి, స్పేస్ టూరిజం అభివృద్ధికి కలెక్టర్ విశేషమైన కృషి చేశారు. అలాగే ఇంటర్నేషనల్ యోగా డే, కృష్ణవేణి సంగీత నీరాజనం, హర్ గర్ తిరంగా, ఫ్లెమింగో ఫెస్టివల్‌ను ఘనంగా నిర్వహించారు. సీఎంతో పాటు పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కలెక్టర్‌ను, జిల్లా యంత్రాంగాన్ని అభినందించారు. ప్రభుత్వం, టూరిజం అథారిటీ, స్థానిక సంస్థలతో సమన్వయం చేసుకుంటూ పర్యాటకులకు మరింత సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని కలెక్టర్ చెప్పారు. కాగా, ఉత్తమ రిసార్ట్‌గా మాంగో రిసార్ట్ శ్రీసిటీ, ఉత్తమ స్టార్ హోటల్‌గా మారస సరోవర్, ఉత్తమ చెఫ్‌గా భారతీరాజా తాజ్ హోటల్, ఉత్తమ టూరిస్టు డెస్టినేషన్ అర్బన్, రూరల్‌కు సంబంధించిన తిరుపతి కార్పొరేషన్ కమిషనర్ మౌర్య, బెస్ట్ డిస్ట్రిక్ట్ ప్రమోటింగ్ టూరిజం(కలెక్టర్) జిల్లా కలెక్టర్, బెస్ట్ టూరిజం ఫ్రెండ్లీ ఎయిర్‌పోర్టు తిరుపతి ఎయిర్‌పోర్టు, బెస్ట్ టూరిజం ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూట్‌గా ఇండియన్ కలినరీ ఇన్‌స్టిట్యూట్(తిరుపతి), ఆర్ట్ అండ్ కల్చర్ కింద శ్రీకాళహస్తికి చెందిన దశరథాచారికి అవార్డులు లభించాయి.

అధికారులూ.. శభాష్

● మహిళా సాధికారత సదస్సు విజయవంతంపై యంత్రాంగానికి స్పీకర్ ప్రశంసలు



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): తిరుపతి వేదికగా ఈ నెల 14, 15 తేదీల్లో నిర్వహించిన మహిళా సాధికారత సదస్సును విజయవంతం చేసిన జిల్లా యంత్రాంగాన్ని స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రశంసించారు. శనివారం అసెంబ్లీ వేదికగా ఆయన అభినందనలు తెలిపారు. సదస్సు ప్రారంభం నుంచి చివరి వరకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా చక్కటి ఏర్పాట్లతో సదస్సును విజయవంతంచేసి రాష్ట్రానికి మంచిపేరు తీసుకువచ్చారని అధికారులను అభినందించారు. కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, కమిషనర్ మౌర్య, ఎమ్మెల్యేలు పులివర్తి నాని, బొజ్జల సుధీర్‌రెడ్డి, ఆరణి శ్రీనివాసులు, తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్‌రెడ్డితోపాటు పలువురు ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిదన్నారు.





చెన్నై గొడుగులు వచ్చేశాయ్

తిరుమల(కల్చరల్), సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): చెన్నై గొడుగులు కూడా తిరుమలకు చేరుకున్నాయి. టీటీడీ ఛైర్మన్ బీఆర్‌నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్‌కు హిందూ ధర్మార్థ సమితి ట్రస్టీ ఆర్‌ఆర్ గోపాల్‌జీ వీటిని అందించారు. వరుసగా 21వ సారి శ్రీనివాసునికి గొడుగులను సమర్పిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్, ప్రశాంతి, కృష్ణమూర్తి వైద్యనాథన్ తదితరులు పాల్గొన్నారు.

మాడవీధిలో చిన్నారికి అస్వస్థత



బాలికను ఎత్తుకుని పరుగులు తీస్తున్న భద్రతాసిబ్బంది

శ్రీవారి ఆలయ మాడవీధుల్లో శనివారం రాత్రి పదేళ్ల బాలిక తీవ్ర అస్వస్థతకు గురైంది. చిన్నజీయర్ మఠానికి సమీపంలోని గ్యాలరీ నుంచి సర్వభూపాల వాహనసేవను వీక్షిస్తున్న క్రమంలో ఆమె మూర్ఛవ్యాధితో కుప్పకూలిపోయింది. నోటి నుంచి రక్తం రావడంతో బాలిక తల్లిదండ్రులు రోదిస్తూ సమీపంలో భద్రతాసిబ్బంది సాయం కోరారు. వారు వెంటనే బాలికను ఎత్తుకుని వాహనం ఎదురుగా పరుగులు తీశారు. భారీ రద్దీ క్రమంలో గేట్లు తాళం వేయడంతో తిరిగి మ్యూజియం వైపునకు వేగంగా వేసుకున్న అక్కడున్న అంబులెన్స్‌లో అశ్విని ఆస్పత్రికి తరలించారు. మూర్ఛవల్ల నాలుక కొరుక్కోవడంతో నోటి వెంట రక్తం వచ్చిందని వైద్యులు తెలిపారు. ప్రస్తుతం బాలిక కోలుకుంటుంది.

సర్వభూపాలంపై స్వామివారు

తిరుమల, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో శనివారం రాత్రి జరిగిన సర్వభూపాల వాహనంపై బకాసురవధ అలంకారంలో శ్రీదేవి, భూదేవి సమేతంగా మలయప్పస్వామి భక్తులను దర్శనమిచ్చారు. గజరాజులు, అశ్వాలు, భజన బృందాలు, కోలాటాలు, జీయంగార్ల గోష్ఠి ముందు సాగుతుండగా గోవిందుడు తన వైభవాన్ని చూపారు.

ఘటాటోపంలో వాహనసేవ : ఉదయం ఓ మోస్తరుగా ఎండ కనిపించినప్పటికీ ఆ తర్వాత నల్లటి మేఘాలు తిరుమలను కప్పేశాయి. రాత్రి వరకు చల్లటిగాలులు వీయగా, రాత్రి 8.45 గంటల సమయంలో కొద్ది సేపు చిరుజల్లులు కురిశాయి. దీంతో ఉత్సవమూర్తులు తడిచిపోకుండా ఘటాటోపం నీడలో వాహనసేవను నిర్వహించారు. చినుకులు ఆగిపోవడంతో యాదావిధిగా ఘటాటోపాన్ని తొలగించి వాహనసేవను నిర్వహించారు.

వరదరాజస్వామికి లక్ష్మీ కౌస్తుభం కానుక



ఆలయాధికారులకు లక్ష్మీకౌస్తుభం అందజేస్తున్న దాతలు

యాదమరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): యాదమరిలోని త్రివేణి సంగమంలో వెలసి ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత ఇంద్ర వరదరాజస్వామి వారి ఆలయంలో తమిళ పెరటాశి మాసం రెండో శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. యాదమరికి చెందిన బి.కుప్పురాజులు శెట్టి, కళావతమ్మ దంపతులు ఆరు లక్షల విలువైన 48 గ్రాముల బంగారు లక్ష్మీకౌస్తుభాన్ని (పతకం)స్వామివారికి కానుకగా సమర్పించారు.ఆలయ ధర్మకర్తలు, ప్రధాన అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

పలమనేరు ఏఎంసీ వైస్ చైర్మన్‌గా దిలీప్



బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మన్‌గా నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి, బైరెడ్డిపల్లెకు చెందిన పసుపులేటి దిలీప్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. తనపై నమ్మకం వుంచిన ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్,ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, ఉమ్మడి చిత్తూరుజిల్లా జనసేన అధ్యక్షుడు హరిప్రసాద్ తదితరులకు దిలీప్ కృతజ్ఞతలు తెలిపారు. రైతు సమస్యల పరిష్కారానికి, మార్కెట్ కమిటీ అభివృద్ధికి శాయశక్తులా కృషిచేస్తానని తెలిపారు.దిలీప్‌ను పలువురు కూటమి పార్టీల నాయకులు అభినందించారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోండి

బధిరులకు వికలాంగుల శాఖ ఏడీ సూచన


సమావేశంలో ప్రసంగిస్తున్న వినోద్

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలను బధిరులు సద్వినియోగం చేసుకోవాలని వికలాంగుల శాఖ ఏడీ వినోద్ సూచించారు. శనివారం జడ్పీ సమావేశపు హాలులో అంతర్జాతీయ బధిరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని 3,678 మంది విభిన్న ప్రతిభావంతులకు, బధిరులకు, సీనియర్ సిటిజన్లకు రూ. 4.69కోట్లతో సహాయ పరికరాలను పంపిణీ చేశామన్నారు. రూ.37.97 లక్షలతో 913 మందికి ల్యాప్‌టాప్, ట్రైసైకిళ్లు, వినికిడి యంత్రాలు, వాకింగ్ స్టిక్స్ తదితరాలను అందజేశామని చెప్పారు. ఈ సమావేశంలో జడ్పీ డిప్యూటీ సీఈవో వెంకటనారాయణ, వికలాంగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మురళి, మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు పాల్గొన్నారు.

తిరుమల పాదయాత్రలో విషాదం

● ట్రాక్టర్ కిందపడి మేస్త్రి మృతి


మృతిచెందిన చలపతి

కల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమలకు పాదయాత్రగా వెళుతూ ట్రాక్టర్ కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన పులిచెర్ల మండలం కల్లూరులో సోమవారం జరిగింది. వివరాలిలా... మండలంలోని పాతపేటకు చెందిన చలపతి (36) మేస్త్రి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి 13 ఏళ్ల క్రితం మతుకువారిపల్లికి చెందిన సుదర్శినితో వివాహమైంది. వివాహమైన కొన్నాళ్లకే తన భార్య పుట్టినిల్లు అయిన మతుకువారిపల్లిలో కాపురంపెట్టాడు. శనివారం ఉదయం గ్రామానికి చెందిన సుమారు 50 మందితో కలిసి తిరుమలకు పాదయాత్రగా బయలుదేరారు. ఈ పాదయాత్రలో యాత్రికులకు భోజనం, తాగునీరు తదితర వస్తువులతో వీరివెంట ఓ ట్రాక్టర్ బయలుదేరింది. ఈ ట్రాక్టర్ ఇంజన్‌పై చలపతి కూర్చొని వెళుతుండగా కల్లూరు వద్ద చలపతి ట్రాక్టర్ ఇంజన్‌పై నుంచి ప్రమాదవశాత్తు టైరు కింద జారిపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడు చలపతిని పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్సలు అందిస్తుండగా ఆస్పత్రిలోనే మృతిచెందాడు. పోలీసులు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో ఆనంద్ తెలిపారు.

జీఎస్టీపై అవగాహన పెంచుకోండి: గౌనివారి

రామకుప్పం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వస్తు సేవల పన్నుల (జీఎస్టీ)పై రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే అవగాహన సదస్సుల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు కోరారు. శనివారం ఆయన రామకుప్పంలో మీడియాతో మాట్లాడుతూ సామాన్యులపై ఆర్థిక భారం తగ్గించాలని కేంద్రం పలు వస్తువులపై సేవా పన్నులను తగ్గించమే కాకుండా మరి కొన్నింటిపై పూర్తిగా తొలగించిందన్నారు. దీంతో సబ్బులు, షాంపులు ఇతర కిరాణా సామాగ్రి ధరలు దిగివచ్చాయన్నారు. అయితే దుకాణాల్లో పాతరేట్లకే విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. 147 వస్తువులను జీరో జీఎస్టీ జాబితాలో చేర్చినా వాటికి సైతం దుకాణదారులు పన్నులతో సహా వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తడంతో కేంద్రం వాటి జాబితాను ప్రకటించిందన్నారు. ఈ విషయమై ప్రజలు ఖచ్చితంగా తెలుసుకోవాలన్నారు. లేకుంటే వస్తుందన్నారు. 12, 28 స్లాబులను కేంద్రం పూర్తిగా రద్దు చేసిందని, 5, 18 శాతం స్లాబుల్లో మాత్రమే పన్నులున్నాయన్నారు. జీఎస్టీ తగ్గించినందుకు ఆయన ప్రధాని మోదీ, ఆర్థికమంత్రి నిర్మలసీతారామన్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. జీఎస్టీ రద్దు, తగ్గింపుపై రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో దసరా నుంచి దీపావళి వరకు సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌ను కార్యచరణను సీఎం చంద్రబాబు ప్రకటించారని ఆయన తెలిపారు.


16 నాటుబాంబుల స్వాధీనం

● వాహనాల తనిఖీలో బయటపడ్డ వైనం
● పోలీసుల అదుపులో నిందితుడు


రాజశేఖర్

పెనుమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): 16 నాటుబాంబులు తీసుకెళుతున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.పెనుమూరు మండలం రామకృష్ణాపురం పరిసర ప్రాంతాల్లో పోలీసులు శనివారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేస్తుండగా వెదురుకుప్పం మండలం పాతగుంట పంచాయతీ జక్కదొన గ్రామానికి చెందిన రాజశేఖర్ ద్విచక్ర వాహనంలో వెళుతూ గోతంలో 16 నాటుబాంబులను తీసుకెళ్ళడాన్ని గుర్తించారు.అడవి ప్రాంతంలో పందుల వేటకు ఉపయోగించడానికి తానే స్వయంగా తయారుచేసుకుని తీసుకెళుతున్నట్లు రాజవేఖర్ వారికి చెప్పాడు.దీంతో నాటుబాంబులను స్వాధీనం చేసుకుని రాజశేఖర్‌ను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఏపీసీసీఐఎఫ్ ఉపాధ్యక్షుడిగా కేవీ చౌదరి



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): ఏపీ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ ఫెడరేషన్(ఏపీసీసీఐఎఫ్) రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా తిరుపతికి చెందిన కేవీ చౌదరి ఎంపికయ్యారు. శనివారం విజయవాడలోని ఓ ప్రైవేట్ హోటల్లో జరిగిన ఏపీసీసీఐఎఫ్ సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర నేతలు ఈమేరకు ప్రకటించారు. ఈ సందర్భంగా కేవీ చైదరి మాట్లాడుతూ వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. పలువురు ప్రముఖులు ఆయన్ను అభినందించారు.

48 పీహెచ్‌సీలు...... 53 కాన్పులు

ఒక్క కాన్పు కూడా జరగనివి 22 ● వైద్యశాఖ అధికారులపై కలెక్టర్ సీరియస్


వైద్యాధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలందించేందుకు ఏర్పాటుచేసిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సేవలు అరకొరగానే అందుతున్నాయి. ప్రతి కేంద్రంలో కాన్పులు చేయాల్సి ఉండగా అవి జరగడం లేదు. ఫలితంగా చాలా మంది ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారు. జిల్లాలో 48 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలుండగా ఆగస్టు నెలలో కేవలం 53 కాన్పులు మాత్రమే జరిగినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. రామకుప్పం పీహెచ్‌సీలో 11, తూగుండ్రం, మల్లానూరుల్లో 4 చొప్పున, పూతలపట్టు , పచ్చికాపలం, సోమలల్లో 3చొప్పున, విజయపురం, మాదిరెడ్డిపల్లి, కాణిపాకం, బైరెడ్డిపల్లె, రాయల్‌పేట, రామకుప్పం వీర్నమలల్లో 2చొప్పున, తుంబకుప్పం, ఎస్ఆర్ పేట, పత్తికొండ, గుడిపాల, గుడుపల్లె, పైపల్లె, నింద్ర, పాలసముద్రం, పెద్దపంజాణి, చౌడేపల్లె, విజలాపురం, ఆరిమాకులపల్లి, ఎస్‌ఆర్ పురం పీహెచ్‌సీల్లో ఒక్కోటి చొప్పున ప్రసవాలు జరిగాయి.

ఒక్కటి జరిగితే ఒట్టు....

తీర్థం, జీడీనెల్లూరు, గంగవరం, బొమ్మసముద్రం, ఐరాల, కంగుంది, ఎన్.కొత్తపల్లి, బుగ్గ అగ్రహారం, కొలమాసనపల్లె, కల్లూరు, పులిచర్ల, ఎల్లంకివారిపల్లె, ముదిబాపనపల్లె, తలపులనేనివారిపల్లె, రొంపిచెర్ల, రాళ్లబూదుగూరు, శాంతిపురం, చెరుకువారిపల్లి, కందూరు, పెద్దఉప్పరపల్లె, తవణంపల్లె, ఓగు, విజయపురం పీహెచ్‌సీల్లో ఒక్క కాన్పు కూడా జరగలేదు.

తనిఖీలు లేవు

జిల్లాలో 48 పీహెచ్‌సీలుంటే ఒక నెల్లో కనీసం ఐదింటిని కూడా జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారులు తనిఖీ చేయడంలేదన్న ఆరోపణలున్నాయి. పీహెచ్‌సీ వైద్యాధికారులు కూడా చాలాచోట్ల అందుబాటులో ఉండడం లేదని 24 గంటల ఆస్పత్రుల్లో రాత్రి పూట వైద్య సిబ్బంది ఉండడం లేదని విమర్శలొస్తున్నాయి. ఇటీవల పూతలపట్టు మండలంలో ఓ రాత్రి పాము కాటుకు గురై ఆస్పత్రికి వెళ్తే పీహెచ్‌సీలో వైద్యులు, సిబ్బంది లేక చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి రావడమే ఇందుకు ఉదాహరణ.ఇటీవల పీహెచ్‌సీల్లో వైద్య సేవలపై ప్రభుత్వం ఐవీఆర్‌ఎస్ సర్వే నిర్వహిస్తుండడంతో ఉన్నతాధికారి ఒకరు వైద్యాధికారులు అందుబాటులో ఉండాలని, రోగులతో మర్యాదగా నడుచుకోవాలని,అవసరమైన మందులు, మాత్రలు ఇవ్వాలంటూ హెచ్చరించారని సమాచారం.

చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రిపై అధిక భారం

పీహెచ్‌సీల్లో కాన్పులు జరక్కపోవడానికి వైద్యులు, సిబ్బంది అందుబాటులో లేకపోవడం ఒక కారణమైతే, కాన్పు సమయంలో ఏదైనా జరిగితే ఆ నింద తమపై పడుతుందని నార్మల్ డెలివరీకి అవకాశం ఉన్నా చిత్తూరుకు రెఫర్ చేసి చేతులు దులుపుకుంటున్నారు. రెఫర్ చేసిన కేసుల్లో సగం 108వాహనాల్లోనే ప్రసవిస్తున్నారు.కనీస పరికరాలతోనే 108సిబ్బంది ప్రసవాలు చేస్తుండగా... కాన్పు చేయడానికి అన్ని సౌకర్యాలున్న పీహెచ్‌సీల్లో మాత్రం కాన్పులు చేయడం లేదంటే పరిస్థితి అర్థమవుతుంది.జిల్లాలో 80శాతం కాన్పుల కేసులను చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికే రెఫర్ చేస్తుండడంతో పని భారం అధికమై ఇక్కడ వైద్యులు ఒత్తిడికి లోనవుతున్నారు. ఈ నేపథ్యంలో శనివారం కలెక్టరేట్ లోని మీటింగ్ హాలు నుంచి వైద్యాధికారులతో కలిసి వర్చువల్ విధానంలో ట్రైనీ కలెక్టర్ నరేంద్ర పాడెల్, జిల్లా వైద్యాధికారులు, పీహెచ్‌సీ డాక్టర్లతో కలెక్టర్ కలెక్టర్ సుమిత్‌కుమార్ సమీక్షించారు. పీహెచ్‌సీల్లో ప్రసవాలు ఆశించిన స్థాయిలో జరగడం లేదని వైద్య ఆరోగ్య శాఖ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. ప్రసవాలు ఎందుకు జరగట్లేదో కనీసం పరిశీలించారా అని ప్రశ్నించడంతో పాటు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించినట్లు సమాచారం.పీహెచ్‌సీ పరిధిలో గర్భిణుల నమోదు ఇప్పటికి 80 శాతం మాత్రమే పూర్తయ్యిందని, మిగిలిన 20 శాతం వచ్చేవారంలోగా పూర్తిచేయాలన్నారు. తక్కువ రిజిస్ట్రేషన్ చేసిన ఏఎన్ఎం, డాక్టర్లందరూ ప్రతి కేసు వివరాలపై తనకు నివేదిక ఇవ్వాలని చెప్పారు. లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఉత్సాహంగా 2కే రన్



2కే రన్‌ను ప్రారంభిస్తున్న ఎంపీ ప్రసాదరావు

చిత్తూరు క్రీడలు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా చిత్తూరులో శనివారం నిర్వహించిన 2కే రన్ ఉత్సాహంగా సాగింది. గాంధీ విగ్రహం వద్ద 2కే రన్‌ను ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు ప్రారంభించారు. అనంతరం మెసానికల్ మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రసంగించారు. పర్యాటక రంగం అభివృద్ధికి సీఎం చంద్రబాబు పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. పర్యాటక రంగంలో జిల్లాను అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. 2కే రన్, వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. క్రీడా, పర్యాటక శాఖల అధికారులు పాల్గొన్నారు.

భూగర్భజలాల పెంపునకే మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం


మ్యాజిక్ డ్రైన్ల పనులను పరిశీలిస్తున్న రాష్ట్ర చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్, పీడీ రవికుమార్, చల్లా రామచంద్రారెడ్డి

కల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పల్లెల్లో మురుగునీటి సమస్యను పరిష్కరిస్తూ భూగర్భజలాలు పెంపొందించేందుకే మ్యాజిక్ డ్రైన్ల పనులు చేపడుతున్నామని ఉపాధి హామీ పథకం చీఫ్ క్వాలిటీ కంట్రోల్ అధికారి గోపీచంద్ తెలిపారు. పులిచెర్ల మండలం రాజులపల్లి పంచాయతీ పెద్ద హరిజనవాడలో జరుగుతున్న మ్యాజిక్ డ్రైన్ల పనులను శనివారం పుంగనూరు నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి, డ్వామా పీడీ రవికుమార్‌తో కలిసి ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిమెంట్ డ్రైన్ల కంటే చాలా తక్కువ ఖర్చుతో మ్యాజిక్ డ్రైన్లను నిర్మించడం జరుగుతోందని... మురుగునీరు భూమిలో ఇంకిపోవడంతో భూగర్భ జలాలు పెరుగుతాయన్నారు. వీధుల్లో మురుగునీరు నిల్వ ఉండదని, దీంతో దోమలు, వ్యాధులు తగ్గుతాయని తెలిపారు. మ్యాజిక్ డ్రైన్లను రాష్ట్ర వ్యాప్తంగా ప్రయోగాత్మకంగా నిర్మించి వాటి పనితీరును పరిశీలిస్తున్నామన్నారు. ఉపాధి పనుల్లో సమస్యలను టీడీపీ నాయకులు తీసుకురాగా ఆయన స్పందించి తక్షణం పరిష్కరించాలని డ్వామా పీడీని ఆదేశించారు. టీడీపీ నాయకులు కుమార్ రెడ్డి, సుబ్బారెడ్డి, మహేష్, రమేష్, సుబ్రహ్మణ్యం నాయుడు, శీను నవీన్‌రెడ్డి, సురేష్, రాజేష్, కిరణ్‌కుమార్, ఏపీడీ శ్రీనివాసులు, ఏపీవో సౌభాగ్యవతి, జేఈ కృష్ణయ్య, టీఏలు సుభాషిణి, జ్యోతిరెడ్డి, కీర్తి, మహేంద్ర, కిరణ్, ఎఫ్ఏ పాల్గొన్నారు.

పంటలపై కొనసాగుతున్న ఏనుగుల దాడులు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి, టమోటా పంట

కల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలో పంటలపై ఏనుగుల గుంపు దాడులు కొనసాగుతూనే ఉన్నాయి. మండలంలోని దేవళంపేట పంచాయతీలో శుక్రవారం రాత్రి వరి, కొబ్బరి, టమోటా, మామిడిచెట్లపై ఏనుగుల గుంపు దాడులు చేయడంతో అపారనష్టం వాటిల్లింది. శుక్రవారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని సూరప్పచెరువు నుంచి బయలుదేరిన 9 ఏనుగుల గుంపు హంద్రీ-నీవా కాలువ దాటుకొని దిగుమూర్తివారిపల్లి వద్దకు చేరుకున్నాయి. అక్కడ ఘీంకారాలు చేసిన ఏనుగుల గుంపు నాయనిచెరువు మార్గంలో మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ మిట్టమీదరాచపల్లి వద్దకు చేరుకున్నాయి. రైతులు బసవయ్య, భాస్కర్, ప్రభాకర్‌కు చెందిన వరి, టమోటా, పశుగ్రాసాన్ని ఏనుగులు గుంపు ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి కల్లూరు-పులిచెర్ల రోడ్డును దాటుకున్న ఏనుగుల గుంపు రైతులు కృష్ణారెడ్డి జగ్మోహన్‌రెడ్డికి చెందిన వరి, మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి. చిన్ననగరి మార్గంలో దేవళంపేట వద్దకు చేరుకొని సుధాకర్, ప్రభాకర్‌కు చెందిన వరి, పశుగ్రాసాన్ని ధ్వంసం చేసిన ఏనుగులు అడవిలోకి తిరుగుముఖం పట్టాయి. దిగుమూర్తివారిపల్లి మీదుగా రైతులు చెంగల్రాయులు, శంకర్‌కు చెందిన మామిడిచెట్ల కొమ్మలను విరుచుకుంటూ అడవిలోకి చేరుకున్నాయి. శనివారం పగలంతా అడవిలోని సూరప్పచెరువు వద్ద ఏనుగులు గుంపు తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.

ఓటరు జాబితా సమగ్ర పరిశీలన ప్రారంభం

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు 2002లోని ఓటర్లను 2025 ఓటర్ల జాబితా ఆధారంగా పరిశీలించే 'స్పెషల్ ఇన్టెన్సివ్ రివిజన్' (ఎస్.ఐ.ఆర్ - సర్) కార్యక్రమం జిల్లాలో జరుగుతోంది. 2002 తర్వాత నియోజకవర్గాలు, జిల్లాల పునర్విభజన జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రస్తుతం జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 2002లో 13,24,150 మంది ఓటర్లుండగా, 2025లో 15,71,617 మంది ఓటర్లున్నారు. అప్పటికి, ఇప్పటికి పెరిగింది 2,47,167 మంది మాత్రమే. ప్రస్తుతం ఈ జాబితాను సరిపోల్చుతున్నారు.నాలుగు రోజులుగా జిల్లా పరిధిలో సుమారు 75వేల ఓట్లను బీఎల్వోలు పరిశీలించారు. 2002లో 18 ఏళ్లకు ఓటు నమోదు చేసుకున్న వ్యక్తి ఇప్పుడు 40 ఏళ్ళ వయస్సు దాటి ఉంటారు. ప్రస్తుత జాబితాలో 40 ఏళ్ళు పైబడిన ఓటర్లు 2002 నాటి పాత జాబితాలో ఉన్నారో లేదో కూడా పరిశీలిస్తున్నారు. పనిలో పనిగా ఈ జాబితాల్లో మృతులు, డబుల్ ఎంట్రీలు, వలస వెళ్ళిన వారి వివరాలను కూడా చేస్తున్నారు. ప్రత్యేకంగా సమగ్ర పరిశీలన చేసే కార్యక్రమాన్ని జిల్లా అధికారులు ప్రారంభించారు.

నియోజకవర్గాలవారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	2002లో	2025లో
పుంగనూరు	2,04,143	2,39,587
నగరి	1,87,989	2,02,796
గంగాధరనెల్లూరు	1,86,212	2,06,013
చిత్తూరు	1,77,516	2,03,779
పూతలపట్టు	2,03,529	2,21,912
పలమనేరు	2,03,877	2,70,496
కుప్పం	1,60,884	2,27,034
మొత్తం	13,24,150	15,71,617

మానవత్వమే అభిమతం కావాలి

● జాషువా జయంతి సభలో సుజనా చౌదరి


జాషువా చిత్రపటాన్ని పల్లకిలో ఊరేగిస్తున్న సుజనా చౌదరి,భానుప్రకాష్‌రెడ్డి తదితరులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సూర్య చంద్రులున్నంతవరకూ కుల మౌతాలు ఉంటాయని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే సుజనా చౌదరి పేర్కొన్నారు. బీజేపీ ఆధ్వర్యంలో తిరుపతిలోని కచ్చపి ఆడిటోరియంలో శనివారం గుర్రం జాషువా జయంతి సభలో ఆయన ప్రసంగించారు. కుల మత ప్రభావాలు పోకున్నా అందరూ మానవత్వంతో మెలగాలన్నారు. జాషువా దేశ సౌభాగ్యం పట్ల తన సాహిత్యంలో ఎంతో గొప్పగా స్పందించారన్నారు. ఎస్వీయూ తెలుగు విశ్రాంతాచార్యులు గార్లపాటి దామోదర నాయుడు మాట్లాడుతూ.. దేశ ఔన్నత్యాన్ని పెంపొందించడానికి జాషువా సాహిత్యం తోడ్పడుతుందన్నారు.. పద్మావతి డిగ్రీ కాలేజీ తెలుగు విభాగాధిపతి డాక్టర్ కృష్ణవేణి, అవధాని ఉప్పలదడియం భరత్‌కుమార్ శర్మ, బీజేపీ రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి నూకల మధుకర్, సంస్కృత యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి , టీటీడీ పాలకమండలి సభ్యులు భానుప్రకాష్‌రెడి, నాగోతు రమేష్ నాయుడులు మాట్లాడారు. సభకు ముందు జాషువా చిత్రపటాన్ని పల్లకీలో ఊరేగించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సభలో బీజేపీ నాయకులు కోలా ఆనంద్, జల్లి మధుసూదన్, గుడిసె దేవానంద్, మాజీ ఎమ్మెల్సీ వాకాటి నారాయణరెడ్డి, నాదముని తదితరులు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్ల కోసం సీఎం చంద్రబాబుకు వినతి



సీఎం చంద్రబాబుకు వినతిపత్రం సమర్పిస్తున్న రాజ్‌కుమార్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు రాజ్ కుమార్ అమరావతి లోని సీఎం క్యాంపు కార్యాలయంలో శని వారం ముఖ్యమంత్రి చంద్రబాబును కలి శారు. పీకేఎం ఉడా చైర్మన్ డాక్టర్ బీఆర్.సు రేశ్‌బాబు, రెస్కో చైర్మన్ వీజీ ప్రతాప్‌తో సహా కలిసి కుప్పం పురపాలక సంఘంలోని వివిధ కాలనీలకు వెళ్లే అప్రోచ్ రోడ్ల నిర్మాణానికి సహకరించాలని కోరారు. బేవనపల్లె, పలవరిగానిమిట్ట, మందేపల్లి, బండశెట్టిపల్లి, గుల్లేపల్లి, బేవనపల్లి, తంబిగానిపల్లి, విజలాపురం రోడ్డు, సీగలపల్లి, ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్, కత్తిమానుపల్లి, ఎన్టీఆర్ హౌసింగ్ కాలనీ తదితర ప్రాంతాలను ఇతర ప్రాంతాలకు కలుపుతూ సుమారు రూ.13 లక్షల వ్యయంతో అప్రోచ్ రోడ్లను నిర్మించాలని విన్నవించారు. ఈమేరకు రూపొందించిన పనులు, అంచనాలతో కూడిన వినతిపత్రాన్ని సీఎంకు సమర్పించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ పరిశీలించి నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబానికి భరోసా



మహిళలకు వైద్య పరీక్షలు చేస్తున్న మహిళా వైద్యులు

కుప్పం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం, సమాజం ఆరోగ్యంగా ఉంటాయని జిల్లా డిప్యూటీ వైద్యాధికారి గంగాదేవి, కుప్పం ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంటు విజయకుమారి అన్నారు. కుప్పం పురపాలక సంఘం కొత్తపేట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ కార్యక్రమం నిర్వహించారు. వైద్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మహిళలకు ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రక్తహీనత, మధుమేహం వంటి సమస్యలపై వైద్యపరీక్షలు చేశారు. వైద్యాధికారి డాక్టర్ సుభాష్ రాజ్, నియోజకవర్గ టీడీపీ విస్తరణ కమిటీ సభ్యుడు కన్నన్, అధికార పార్టీ నాయకులు గోపీనాథ్, సత్యేంద్ర శేఖర్, అప్పు ముఖేశ్, మునియప్ప, ఉదయ్ కుమార్, కృష్ణ అర్ముగం, సుకుమార్, మురళీ , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

పశు సంచార వైద్యశాల ప్రారంభం



సంచార పశు వైద్యశాలను ప్రారంభిస్తున్న కడా పీడీ వికాస్ మర్మత్ తదితరులు

కుప్పం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలంలోని చందం పంచాయతీ కొత్తఇండ్లు గ్రామంలో ఆధునిక సంచార పశు వైద్యశాలను శనివారం కడా పీడీ వికాస్ మర్మత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీజ మహిళా మిల్క్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ సంచార పశు వైద్యశాల నడుస్తుందన్నారు. ఆవులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్సలు చేశారు. కార్యక్రమంలో పశు వైద్యులు, శ్రీజ సంస్థ సీఈవో తిమ్మప్ప తదితరులు పాల్గొన్నారు.

సాగుభూములను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

రామకుప్పం, సెప్టెంబరు 27(ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం బల్ల గ్రామ సమీపంలో దశాబ్దాలుగా సాగు చేసుకున్న తమ భూములకు సంబంధించి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని పలువురు రైతులు కోరారు. శనివారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి ఓబులరాజు ఆధ్వర్యంలో 14 మంది రైతులు తహసీల్దారు కౌలేష్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు.

త్వరలో తుమ్మిశి, బెండనకుప్పం చెరువులకు కృష్ణాజలాలు



తుమ్మిశి చెరువులో ముళ్లతొలగింపు కార్యక్రమంలో టీడీపీ నేతలు

రామకుప్పం/శాంతిపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): శాంతిపురం మండలంలోని తుమ్మిశి, బెండనకుప్పం చెరువులకు త్వరలో హంద్రీ-నీవా కాలువ ద్వారా కృష్ణాజలాలు చేకుంటాయని టీడీపీ మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు ఉదయ్‌కుమార్, విశ్వనాథ్‌లు తెలిపారు. శనివారం తుమ్మిశి చెరువు నుంచి బెండనకుప్పం చెరువు వరకు గల కాలువలోని ముళ్లచెట్ల తొలగింపు కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నేతలు రాజేంద్రప్రసాద్, గోపాల్, విజయరామిరెడ్డి, నారాయణస్వామి, ఆర్ఎస్‌మణి, ఆంజినేయరెడ్డి, బాలు, రామచంద్రనాయుడు, చలపతి ,వెంకటేశ్, ఏఎంసీనాగరాజు, సింగిరిశ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పేదల కడుపు నింపడమే ధ్యేయం



అన్నక్యాంటీన్ భవన నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వెంకటరమణ

రామకుప్పం, సెప్టెంబరు 27 (ఆంధ్ర జ్యోతి): రాష్ట్రంలో పేదలందరికీ కడుపు నిండా అన్నం పెట్టడమే సీఎం చంద్రబాబు ధ్యేయ మని టీడీపీ మండల అధ్యక్షుడు వెంకటరమణ తెలిపారు. రామకుప్పంలో శనివారం ప్రారంభమైన అన్నక్యాంటీన్ భవన నిర్మాణ పనులను వాల్మీకి సాధికార సమితి నేతల మురళీతో కలిసి ఆయన పరిశీలించారు. కుప్పం నియోజకవర్గంలో ప్రత్యేకంగా కుప్పం మున్సిపాల్టీతోపాటు రామకుప్పం, శాంతిపురం, గుడుపల్లె, మల్లానూరుల్లో అన్నక్యాంటీన్లను ఏర్పాటు చేస్తున్నారని తెలిపారు.

ఆలయాలకు దసరా శోభ..!

● ప్రత్యేకాలంకరణల్లో దేవతామూర్తుల దివ్యదర్శనం



చౌడేపల్లె: అమ్మవారి కలశ స్థాపన



కుప్పం: స్వామివారి సేవకు తరలివచ్చి పొంగళ్లు పెడుతున్న భక్తులు



కుప్పం: విశేష అలంకరణలో కదిరి నరసింహస్వామి



చౌడేపల్లె: ఉభయదారులచే హోమం చేయిస్తున్న వేదపండితులు



సోమల బోయకొండ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ

పుంగనూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పుంగనూరులోని పలు ఆలయాల్లో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం దేవతా మూర్తులకు ప్రత్యేకంగా అలంకరణలు, పూజలు నిర్వహించారు. స్థానిక కోనేరు వద్ద వెలసిన కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలో ఉదయం అష్టలక్ష్మీ అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం వెంకటరమణుడు అద్దాల మండపంలో శ్రీరాముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి భక్తులకు తీర్థ ప్రసాదాల పంపిణీచ భక్తులకు ఏర్పాట్లు పర్యవేక్షించారు. విరూపాక్షి మారెమ్మ అన్నపూర్ణాదేవి అలంకరణలో, బజారు వీధిలో వెలసిన వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ధనలక్ష్మి అలంకరణలో, చదళ్ల వద్ద వెలసిన చౌడేశ్వరీదేవి అన్నపూర్ణేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఆలయ ధర్మకర్త వేణుగోపాల్ రెడ్డి అన్నదానం చేశారు. నగరిలో వెలసిన సోమేశ్వరస్వామి ఆలయంలో ప్రసన్న పార్వతీదేవి, కోనేరు వద్ద కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి, భోగనం జుండేశ్వరస్వామి ఆలయంలో పార్వతి అమ్మవారు ప్రత్యేక అలంకరణలో దర్శనమిచ్చారు.

శాకంబరిగా గంగమ్మ విశ్వరూపం

● **చౌడేపల్లె:** ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ దసరా మహోత్సవాలలో ఐదో రోజున అమ్మవారు శాకంబరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం ఆలయ అర్చకులు అమ్మవారిని వేకువజామునే సుప్రభాత సేవతో మేల్కొలిపి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. కూరగాయలతో శాకాంబరిదేవిగా అలంకరించి ధూప దీప నైవేద్యం సమర్పించారు. ఉభయ దారులకు అమ్మవారి శేష వస్త్రాలు, తీర్థ ప్రసాదాలను ఆలయ ఈవో ఏకాంబరం అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

●**కుప్పం:** కుప్పం మండలం గుడ్లనాయనిపల్లె పంచాయతీ అటవీ ప్రాంతంలో వెలసిన కదిరి నరసింహస్వామికి శనివారం వైభవోపేతంగా పూజలు జరిగాయి. పంచాయతీలోని గుడ్లనాయనిపల్లె, సలార్లపల్లె, ఊరియానిపల్లె కొత్తూరు గ్రామాలకు చెందిన గ్రామస్తులు ఉదయం పెద్దఎత్తున ఆలయానికి తరలివచ్చారు.

●**సదుం:** జాండ్రపేటలోని రామలింగ చౌడేశ్వరిదేవి అమ్మవారు శనివారం రాజరాజేశ్వరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే పచ్చార్లమాకులపల్లెలోని గంగాపురమ్మ లలిత త్రిపుర సుందరి అలంకరణలోనూ, సదుం గ్రామ దేవత సదుమమ్మ, నడిగడ్డ రెడ్డి ఆధ్వర్యంలో హంస వాహనంపై సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

● **సోమల:** మండలంలోని సోమల బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి, కందూరు కన్యకా పరమేశ్వరి అమ్మవారు, కందూరు పాలేటమ్మవారి ఆలయాల్లో అమ్మవార్లకు విశేష అలంకరణ చేశారు.

● **రొంపిచెర్ల:** రొంపిచెర్ల బజారు వీధిలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు ధనలక్ష్మీదేవి అలంకరణలో శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదాతలుగా రాజా ఉదయకుమార్ దంపతులు వ్యవహరించారు.

● **రొంపిచెర్ల** : రొంపిచెర్లలోని చెన్నకేశవ స్వామి ఆలయంలో శనివారం భక్తులతో సందడి వాతావరణం నెలకొంది. లక్ష్మీదేవి, ఆంజనేయస్వామిలకు కలశ పూజ, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అర్చనలు చేసి తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.



చౌడేపల్లె: ప్రత్యేకాలంకరణలో మూలస్థానం అమ్మవారు



రాజరాజేశ్వరి అలంకరణలో రామలింగ చౌడేశ్వరి దేవి



పుంగనూరు: కల్యాణ వెంకటరమణస్వామి



పుంగనూరు: అన్నపూర్ణాదేవిగా విరూపాక్షి మారెమ్మ



పుంగనూరు: చదళ్లలో అన్నపూర్ణేశ్వరీదేవిగా చౌడేశ్వరిదేవి



సదుం: రాజరాజేశ్వరిగా రామలింగ చౌడేశ్వరి దేవి

నేడు కుప్పంలో చెన్నై ఫెర్టిలిటీ వైద్య శిబిరం

చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సంతానం లేని దంపతులకు చెన్నై ఫెర్టిలిటీ సెంటర్ ఆధ్వర్యంలో ఆదివారం కుప్పం శ్రీప్రియ నర్సింగ్ హోమ్‌లో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఐవీఎఫ్ వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు జీడీ నెల్లూరు ఎమ్మెల్యే, డాక్టర్ వీఎం థామస్ తెలిపారు. గత ఎనిమిది సంవత్సరాలుగా రాష్ట్రంలో 57 ప్రత్యేక ఐవీఎఫ్ ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి 7వేల మందికి పైగా సంతాన సాఫల్యతను కల్పించామన్నారు. కుప్పంలో నిర్వహించే శిబిరంలో దంపతులకు సలహాలు, సూచనలు ఉచితంగా ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇతర వివరాల కోసం 81796 44570, 99621 83377 నెంబర్లను సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి

బైరెడ్డిపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకశ్రద్ధ తీసుకుంటామని బైరెడ్డిపల్లె తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎంపీడీవో చంద్రశేఖర్‌రెడ్డి, ఎంఈవో వేణుగోపాల్‌రెడ్డి, హెడ్‌కానిస్టేబుల్ నాగరాజు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో శనివారం మండలస్థాయి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ఉన్న ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి అధికారులు తగిన చర్యలు చేపట్టాలని మానిటరింగ్ కమిటీ సభ్యులు కోరారు. అధికారులు తక్షణం స్పందించాలని కోరారు. సమావేశంలో వివిధశాఖల అధికారులు, మానిటరింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో శిక్షణ పొందితే ఉద్యోగావకాశాలు



ఎన్‌సీసీకి ఎంపికైన విద్యార్థులు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఎన్‌సీసీలో శిక్షణ పొందడంతో ఉద్యోగ అవకాశాల్లో ప్రాధాన్యత ఉంటుందని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌సీసీ అధికారి సోమరాజు తెలిపారు. శనివారం స్థానిక కళాశాలలో ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు వివిధ పరీక్షలు నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులకు మూడేళ్ల శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, అధ్యాపకులు తెలిపారు.

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మునస్వామిని సన్మానిస్తున్న ఉన్నిగానిపల్లె టీడీపీ నేతలు

రామకుప్పం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి తద్వారా క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టతకు నేతలు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని గ్రంథాలయ పరిషత్ రాష్ట్ర డైరెక్టరు మునస్వామి పిలుపునిచ్చారు. శనివారం మండల పరిధి ఉన్నిగానిపల్లెకు పంచాయతీకి చెందిన టీడీపీ నేతలు, కార్యకర్తలు గ్రంథాలయ పరిషత్ డైరెక్టరుగా నియమితులైన ఆయనను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ యూనిట్ ఇన్‌చార్జి రామ్మూర్తి, మాజీ సర్పంచి జయశంకర్, తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి శంకర్‌చలం, నేతలు తదితరులు పాల్గొన్నారు.

మహిళల సంపూర్ణ ఆరోగ్యానికే వైద్యశిబిరాలు



సోమలలో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ జయసింహ

సోమల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలు సంపూర్ణ ఆరోగ్య పరిరక్షణకే ఉచిత వైద్యశిబిరాలు నిర్వహిస్తున్నారని నోడల్ అధికారి డాక్టర్ జయసింహ తెలిపారు. శనివారం సోమలలో స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ వైద్యశిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు వైద్యులు మహిళలకు వైద్యపరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగిల్ విండో అధ్యక్షుడు శివశంకర్, టీడీపీ నాయకులు మహేంద్రబాబు, చాణుక్య, ఐసీడీఎస్ సూపర్ వైజర్ హరిత, సీహెచ్‌వో అమరనాథ్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఎంపిక కమిటీ సభ్యుడిగా శివరాయల్



వి.కోట, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నేషనల్ యూత్ కార్ప్స్ పథకం కింద మైభారత్ యూత్ వలంటీర్ల ఎంపిక కోసం ఏర్పాటైన కమిటీ సభ్యుడిగా వి.కోటకు చెందిన బీజేవైఎం నేత శివరాయల్ నియమితులయ్యారు. తన నియామకానికి హకరించిన బీజేపీ పెద్దలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

మట్టి తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ల స్వాధీనం



పోలీస్‌స్టేషన్‌లో సీజ్ చేసిన ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లు

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ అనుమతులు లేకుండా మట్టిని అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్లను సీజ్ చేసినట్లు పుంగనూరు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ పుంగనూరు మండలం గుడిసెబండ పంచాయతీలోని చెరువుల్లో మట్టిని అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్నట్లు గ్రామస్తులు తహసీల్దార్ రాముకు ఫిర్యాదు చేశారు. తహసీల్దార్ ఆదేశాల మేరకు చెరువులో మట్టి తవ్వుతున్న రెండు ఎక్స్‌కవేటర్లు, తరలించడానికి సిద్ధంగా ఉన్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసుస్టేషన్‌కు తరలించారు. చెరువుల్లో అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

కార్యకర్తలు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



సదుం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పార్టీ పటిష్టత, అభివృద్ధికి నాయకులు, కార్య కర్తలు సాంకేతికతను అందిపుచ్చుకోవాలని వైసీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. శనివారం సదుం మండలం ఎర్రాతివారిపల్లె అయ్యప్పస్వామి ఆలయ ఆవరణంలో మాజీ మంత్రి, పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అధ్యక్షతన పుంగనూరు వైసీపీ నియోజకవర్గస్థాయి విస్తృత స్థాయి సమావేశం జరిగింది. సమావేశంలో సజ్జల మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యేలు భూమన కరుణాకరరెడ్డి, వెంకటే గౌడ, చింతల రామచంద్రారెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, నాయకులు వజ్రప విజయ భాస్కర్ రెడ్డి, విజయానంద రెడ్డి, ఎన్.శ్రీనాథరెడ్డి, అనూషరెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌష్టికాహార ఆవశ్యకతపై అవగాహన



సోమలలో ఆకుకూరలు, పండ్ల ప్రదర్శన

సోమల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి) మహిళలు పౌష్టికాహారంపై అవగాహన కలిగి ఉండాలని ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి అన్నారు. శనివారం సోమలలో పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో పలు వక్తలు అంగన్‌వాడీ కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. పలువురు మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు, సింగల్ విండో చైర్మన్ శివశంకర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ హరిత, అంగన్‌వాడీ కార్యకర్తలు , పలువురు బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

పంట నష్ట బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు అందిస్తున్న ఆర్థిక సాయం

సోమల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): సోమల మండలంలో గత ఏడాది ఏనుగుల దాడులతో పంట నష్టం జరిగిన రైతులకు ఆర్థిక సాయం మంజూరైనట్లు ఏఎంసీ చైర్మన్ శ్రీనివాసులు నాయుడు తెలిపారు. శనివారం సోమల ఎంపీడీవో కార్యాలయంలో ఇరికిపెంట పంచాయతీలోని ఆరుగురికి రూ.58 వేలు అందించారు. అలాగే మండలంలోని పెద్దఉప్పరపల్లె, ఆవులపల్లె, చిన్నఉప్పరపల్లె పంచాయతీలోని పలువురికి రూ.1.80 లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో అటవీ అధికారులు ఇంద్రాణి, మునిరాజ, ధనుంజయ పలువురు రైతులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం



రొంపిచెర్లలో మాట్లాడుతున్న శిరీష

రొంపిచెర్ల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తల్లిపాలు బిడ్డలకు మంచి పౌష్టికాహారం అని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శిరీష అన్నారు. రాష్ట్రీయ పోషకాహార దినోత్సవం సందర్భంగా జాండ్లవారిపల్లె అంగన్వాడీ కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు క్రమం తప్పకుండా ప్రభుత్వం అందించే పోషకాహారం ఇవ్వాలన్నారు. అంగన్వాడీ కార్యకర్త అమరావతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు పుంగనూరులో గరుడ వాహన సేవ

పుంగనూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో ఆదివారం గరుడ వాహన సేవ జరగనున్న నేపథ్యంలో పుంగనూరు కల్యాణ వెంకటరమణస్వామి ఆలయంలోనూ గరుడసేవ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని టీటీడీ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఆదివారం సాయంత్రం కల్యాణ వెంకటరమణుడు గరుడవాహనంపై కొలువుదీరి హైస్కూల్ వీధి, నగరి, బజారువీధి, కుమ్మరవీధి, కట్టకిందపాళ్యం, బ్రాహ్మణవీధుల్లో మంగళవాయిద్యాల నడుమ వైభవంగా శ్రీవారు విహరిస్తారని చెప్పారు. శ్రీవారి భక్తులు గరుడ వాహనసేవలో పాల్గొని తరించాలని ఆయన కోరారు.

చిత్తూరు

జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

చిత్తూరు అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా?

● వైసీపీకి టీడీపీ నేతల సవాల్



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా అని వైసీపీ నేతలకు టీడీపీ నాయకులు సవాల్ విసిరారు. శనివారం ఎమ్మెల్యే జగన్మోహన్ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వంలో నగరాభివృద్ధిని పూర్తిగా విస్మరించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక సీఎం చంద్రబాబు, ఎమ్మెల్యే జగన్మోహన్ ఆధ్వర్యంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరుగుతున్నాయని చెప్పారు. ఫారెస్టు రోడ్డు నిర్మాణం పూర్తయిందని, హైరోడ్డు, గాంధీరోడ్డు విస్తరణ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ప్రధానంగా ఉన్న నీటి సమస్యను తీర్చడానికి, భూగర్భజలాలను పెంచడానికి కట్టమంచి చెరువు పూడికతీతపనులను చేపట్టడం జరిగిందన్నారు. ఎమ్మెల్యేకు వస్తున్న ప్రజాభిమానాన్ని చూసి వైసీపీ నేతలు ఓర్వలేక పోతున్నారని మండిపడ్డారు. దీనికి నిదర్శనమే కట్టమంచి చెరువుపై ఎన్జీటీలో వేసిన కేసు అన్నారు. నేతలు షణ్ముగం, మోహన్‌రాజ్, వెంకటేష్ యాదవ్, కాంద్ర రమేష్ నాయుడు, గోపాల్, నరేష్, లీలావతి, నళిని, శేషాద్రి నాయుడు, నీరజాక్షులు నాయుడు, యువరాజులు నాయుడు, ఉదయ్, పచ్చప్ప తదితరులు పాల్గొన్నారు.

మహిళలందరూ ఆరోగ్యంగా ఉండాలి: ఎంపీ



మహిళకు పౌష్టికాహారం అందిస్తున్న ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మహిళలందరూ ఆరోగ్యంగా ఉంటే.. అపుడా దేశం కూడా ఆరోగ్యంగా ఉంటుందని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు అన్నారు. శనివారం మురకంబట్టులోని జీవీజీ కళ్యాణ మండపంలో స్వస్థ్ నారీ సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంపీ మాట్లాడుతూ.. మహిళల ఆరోగ్య పరిరక్షణ కోసం ఈ కార్యక్రమానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారని ప్రశంసించారు. ఈ వైద్యశిబిరాలను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ హేమలత, డీఎంహెచ్‌వో సుధారాణి, అడిషనల్ డీఎంహెచ్‌వో వెంకటప్రసాద్, ఐసీడీఎస్ పీడీ వెంకటేశ్వరి, మాజీ ఎమ్మెల్సీ దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలి

విజయపురం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలకు చేరుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి పద్మజ ఆకాంక్షించారు. శనివారం మాధవరం ప్రభుత్వ ఐటీఐలో స్నాతకోత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ భైరవుడు, ఉప శిక్షణాధికారులు లలిత, మునికృష్ణయ్య, పూర్వ విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా మరగదాంబిక

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కాణిపాక క్షేత్రంలోని మరగదాంబిక సమేత మణికంఠేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం మరగదాంబిక అమ్మవారు గాయత్రీదేవి అలంకారంలో భక్తులను కటాక్షించారు.

చిత్తూరు సిటీ: గిరింపేటలోని దుర్గాంబను సరస్వతీదేవిగా అలంకరించారు. అలాగే సాయికృపా అపార్ట్‌మెంట్‌లోని సాయిబాబా ఆలయంలో అమ్మవారిని సంతానలక్ష్మిగా, కాత్యాయనీదేవిగా తేనెబండలోని ముత్యాలమ్మ, మహాలక్ష్మీదేవిగా కొంగారెడ్డిపల్లెలోని ఎట్టెమ్మ భక్తులకు దర్శనమిచ్చారు.

శ్రీరంగరాజపురం: మండలంలోని ఆరిమాకులపల్లెలోని గంగమ్మ ఆలయంలో అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉభయదారులుగా ఆనంద నాయుడు కుమారులు వ్యవహరించారు. వేణుగోపాలపురంలోని శ్రీమూర్తి అమ్మను బాలత్రిపుర సుందరిగా అలంకరించారు. ఉభయదారులుగా సుబ్బా మంది, నాలు చిన్నపాపమ్మ వ్యవహరించారు.

వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎన్‌కండ్రిగలోని కొండమల్లీశ్వరస్వామిఆలయ సముదాయంలో ఉన్న రాజరాజేశ్వరీదేవిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. ● కార్వేటినగరం మండలం డేరాకండ్రిగలోని నైనేరమ్మ కూడా లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

పాలసముద్రం: మండలంలోని బలిజకండ్రిగలో ఉన్న చెవిటిగంగమ్మ.. లక్ష్మీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థప్రసాదాలు అందించారు.

నగరి: పట్టణంలోని దేశమ్మ.. సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కరకంఠేశ్వర ఆలయంలో దుర్గాదేవి, కామాక్షి అమ్మవార్లకు పూజలు, అభిషేకాలు చేశారు. కామాక్షిదేవికి నారాయణి అలంకరణ చేయగా భక్తులను ఆకట్టుకుంది. బుగ్గ అగ్రహారం కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలోని అన్నపూర్ణేశ్వరి అమ్మవారికి కాత్యాయనీ అలంకారం చేశారు. ఓంశక్తి ఆలయంలో అమ్మవారికి పూజలు చేశారు.

విజయపురం: మిట్టూరులో లలితా త్రిపురసుందరీదేవిగా కనకదుర్గమ్మ దర్శనమిచ్చారు. అమ్మవారికి పూజారి మహేశ్‌శర్మ అభిషేకం చేశారు.

గుడిపాల: మండలంలోని కందగిరికొండపై ఉన్న దుర్గమ్మ.. సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు.

గంగాధరనెల్లూరు: అల్లియెల్లమ్మ అమ్మవారిని అన్నపూర్ణేశ్వరిదేవిగా అలంకరించారు. అనంతరం అమ్మవారిని పల్లకిలో ఉంచి ఆలయ నాలుగు మాడవీధుల్లో ఊరేగించారు.



కాణిపాకం: గాయత్రీదేవి అలంకారంలో మరగదాంబిక



చిత్తూరు సాయిబాబా ఆలయంలో సంతానలక్ష్మిగా అమ్మవారు



కాత్యాయనీ దేవిగా తేనెబండ ముత్యాలమ్మ



మహాలక్ష్మీదేవిగా కొంగారెడ్డిపల్లె ఎట్టెమ్మ



శ్రీరంగరాజపురం: గాయత్రీ దేవిగా గంగమ్మ



వెదురుకుప్పం: లలితా త్రిపుర సుందరీదేవిగా నైనేరమ్మ, రాజరాజేశ్వరి





పాలసముద్రం: లక్ష్మీదేవిగా చెవిటి గంగమ్మ



నగరి: సరస్వతీదేవిగా దేశమ్మ



విజయపురం: లలితా త్రిపుర సుందరీదేవిగా కనకదుర్గమ్మ



గుడిపాల: సరస్వతి దేవిగా దుర్గమ్మ



గంగాధరనెల్లూరు: అన్నపూర్ణేశ్వరి దేవిగా అల్లియెల్లమ్మ

'విజయం'లో ముందస్తు దసరా వేడుకలు



చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): విజయం సైన్స్ అండ్ ఆర్ట్స్ డిగ్రీ కళాశాలలో తృతీయ సంవత్సరం విద్యార్థులు, విద్యాసంస్థల అధినేత తేజోమూర్తి ఆధ్వర్యంలో శనివారం ముందస్తు దసరా వేడుకలు నిర్వహించారు. విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణుడి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వేపంజేరిలోని లక్ష్మీనారాయణ స్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాలకు శనివారం రాత్రి అంకురార్పణ పూజలు నిర్వహించారు. అర్చకులు మాధవన్, ఆదిత్య ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఆలయట్రస్టీ, తిరుపతి అడ్వొకెట్ కె.ఎస్. వాసు, వాసు సతీమణి అమృతవల్లి, సుమిత్రా శ్రీధర్, సౌందర్‌రాజన్, రాగిణి, కృష్ణమాచారి, విజయలక్ష్మి, వసంతకుమార్, భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామానికి దారి లేక ఇబ్బందులు

● పెరుమాల్‌కుప్పం గ్రామస్తుల ఆవేదన

గుడిపాల, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): తమ గ్రామానికి దారి లేకుండా ఇబ్బంది పడుతున్నామని పెరుమాల్‌కుప్పం గ్రామస్తులు శనివారం ఆవేదన వ్యక్తం చేశారు. 15 రోజుల కింద కురిసిన వర్షానికి రైల్వే బ్రిడ్జిలో నీరు నిలిచి, రాకపోకలకు అడ్డంకిగా మారిందన్నారు. టీడీపీ నాయకుడు రవి.. రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు. దీనివల్ల సుమారు నాలుగు కిలోమీటర్లు చుట్టుకొని వెళ్లాల్సి వస్తోందన్నారు. ఇంకొందరు రైల్వే ట్రాక్‌పై ప్రమాదకర పరిస్థితుల్లో నడిచి వెళుతున్నారని తెలిపారు. ఇకనైనా సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

రక్తదానం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ జన్మదిన పక్షోత్సవాల్లో భాగంగా శనివారం కాణిపాకం పీహెచ్‌సీలో రక్తదాన శిబిరాన్ని బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. జిల్లా జగదీశ్వర్‌నాయుడు, నాయకులు ఆదినారాయణ, జయచంద్రారెడ్డి, సొప్పాచలపతినాయుడు, పయణి, శ్రీధర్‌నాయుడు, సుజిత్‌రెడ్డి, ప్రసాద్, అశోక్, చిట్టిబాబు పాల్గొన్నారు.

బిందు సేద్యంపై రైతులకు అవగాహన

వెదురుకుప్పం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో శనివారం బిందు సేద్యంపై రైతులకు ఎంఐఏవో జయచంద్రారెడ్డి, ఏఈవో హేమాద్రి అవగాహన కల్పించారు. ఎంఐఏవో మాట్లాడుతూ. గతంలో డ్రిప్ పరికరాలకు రైతులు 12 శాతం జీఎస్టీ చెల్లించేవారని ప్రస్తుతం 2.5 శాతం చెల్లిస్తే చాలన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేత్రపర్వంగా శ్రీవారి కల్యాణోత్సవం



పెనుమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కలిగిరి కొండపై ఉన్న శ్రీవేంకటేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారు కల్పవృక్ష వాహనంపై ఊరేగారు. 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల దాకా స్వామివారి కల్యాణోత్సవం నేత్రపర్వంగా జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం ఊంజల్‌సేవ తర్వాత సర్వభూపాల వాహనంపై స్వామివారిని ఆలయ ప్రాంగణంలో ఊరేగించారు. ఎస్‌ఐ వెంకటనరసింహులు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.

'వైసీపీ ఆరోపణలు అవాస్తవం'

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ మహిళా నేతలు చేసిన ఆరోపణలు అవాస్తవమని 11వ డివిజన్ టీడీపీ కార్పొరేటర్ జయలక్ష్మి, ఆమె భర్త రవికుమార్ స్పష్టం చేశారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో జయలక్ష్మితో కలిసి రవికుమార్ మీడియాతో మాట్లాడారు. 1978 నుంచి గుట్ట పోరంబోకు భూమి తన తండ్రి అనుభవంలో ఉందన్నారు. తాము సాగుచేసుకుంటున్న ఈ భూమికి పట్టా కోసం అనేకసార్లు అధికారులకు వినతిపత్రాలు సమర్పించడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో తమ కుటుంబం ఆ పార్టీ కండువా కప్పుకుంటే పట్టా ఇస్తామని, లేకుంటే ఆ స్థలాన్ని జగనన్న కాలనీకి ఇస్తామని బెదిరించారని ఆరోపించారు. అయినా తాము టీడీపీలోనే కొనసాగుతున్నామన్నారు. ఇపుడు కొందరు వైసీపీ మహిళా నేతలు తాము భూకబ్జాలకు పాల్పడ్డామని అసత్య ప్రచారాలు చేస్తున్నారని అన్నారు. ఇకపై ఇలాంటి ఆరోపణలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. 11వ డివిజన్ టీడీపీ నేతలు పాల్గొన్నారు.

సచివాలయంలో రెండు ప్రింటర్ల చోరీ

వెదురుకుప్పం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): పాతగుంట గ్రామ సచివాలయంలో రెండు ప్రింటర్లు చోరీ అయ్యాయి. శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ప్రింటర్లను ఎత్తుకెళ్లగా శనివారం గుర్తించారు. గ్రామకార్యదర్శి ధనలక్ష్మి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటసుబ్బయ్య తెలిపారు.

'ఆలయాల పాలకమండళ్లలో బీజేపీకి ప్రాధాన్యమివ్వండి'

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన ఆలయాల పాలకమండలి డైరెక్టర్ల నియామకాల్లో బీజేపీకి ప్రాధాన్యం ఇవ్వాలని ఆ పార్టీ నేతలు కోరారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో వారు మీడియాతో మాట్లాడారు. తమ పార్టీవారికి పదవులు ఇవ్వాలని ఎమ్మెల్యే జగన్మోహన్ కార్యాలయానికి లేఖరాసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇకనైనా కూటమి పార్టీల నేతలతో సమావేశం నిర్వహించి, అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు రామభద్ర, షణ్ముగం, వెంకటేష్, విజయ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మాదిరెడ్డిపల్లె అభివృద్ధే లక్ష్యం

టీడీపీ వాణిజ్య విభాగ జిల్లా కార్యదర్శి విజయేంద్ర యాదవ్



ఎమ్మెల్యే మురళీమోహన్‌తో విజయేంద్ర యాదవ్

యాదమరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): మాదిరెడ్డిపల్లె పంచాయతీని అన్నిరకాలుగా అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని టీడీపీ వాణిజ్య విభాగ జిల్లా కార్యదర్శి విజయేంద్ర యాదవ్ స్పష్టం చేశారు. ఎమ్మెల్యే మురళీమోహన్ సహకారంతో పాటు తన తండ్రి, ఎంపీటీసీ కుప్పయ్య ఆధ్వర్యంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలుచేస్తున్నట్లు తెలిపారు. రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ తనకు ఏ బాధ్యత అప్పగించినా, చిత్తశుద్ధితో, సమర్థవంతంగా నిర్వహిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

ఈ-ఆటో ప్రారంభం

వెదురుకుప్పం, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): బొమ్మయ్యపల్లె కాలనీలో ఈ-ఆటోను శనివారం తెలుగు యువత జీడీనెల్లూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురుసాల కిషన్‌చంద్ శనివారం ప్రారంభించారు. టీడీపీ నాయకులు బాష్యం సతీష్‌నాయుడు, వెంకటరమణానాయుడు, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

1న దరఖాస్తుల పరిశీలన

తవణంపల్లె, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): అర్ధగిరి వీరాంజనేయ స్వామి ఆలయ నూతన ధర్మకర్తల మండలి నియామకానికి వచ్చిన దరఖాస్తులను వచ్చేనెల ఒకటో తేదీన చిత్తూరు సహాయ కమిషనర్ పరిశీలించనున్నారు. అభ్యర్థులు బుధవారం ఉదయం 10 గంటలకు అర్ధగిరి ఆలయానికి సంబంధిత ధ్రువీకరణ పత్రాలను రావాలని ఈవో మునిశేఖర్ శనివారం ఒక ప్రకటనలో సూచించారు.

సచివాలయాల్లో తనిఖీలు

పాలసముద్రం, సెప్టెంబరు27(ఆంధ్రజ్యోతి):తిరుమలరాజుపురం, నరసింహాపురం సచివాలయాలను శనివారం ఎంపీడీవో సతీష్ తనిఖీ చేశారు. డిప్యూటీ ఎంపీడీవో సత్యనారాయణ పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

కనకదుర్గమ్మకు పట్టువస్త్రాల సమర్పణ



పూతలపట్టు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): దసరా ఉత్సవాల్లో భాగంగా వావిల్‌తోట పంచాయతీ నొచ్చుపల్లెలోని బంగారి కనకదుర్గమ్మకు టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు గోపి, తేజశ్రీ దంపతులు శనివారం పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయం వద్ద అన్నదానం చేశారు. ఆలయ ధర్మకర్త గజేంద్రన్, టీడీపీ నేతలు దుబాయ్ నరసింహులు, మధు, జగన్నాథం, రామమూర్తినాయుడు, దేవరాజులునాయుడు, ఆదెయ్య, బబ్లూ తదితరులు పాల్గొన్నారు.

అలిమేలు మంగమ్మకు కిరీటం, ప్రభ వితరణ



నగరి, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నగరి మండల పరిధిలోని మాంగాడులోని అలిమేలు మంగమ్మకు 13 వేల విలువైన కిరీటం, ప్రభను నగరి పీఏసీఎస్ సీఈవో తులసిపిళ్లై శనివారం కానుకగా అందించారు. కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు.

'నామినేటెడ్ పదవుల్లో అవకాశమివ్వండి'



చంద్రబాబుతో థామస్, శ్రీధర్‌యాదవ్

గంగాధరనెల్లూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): నామినేటెడ్ పదవుల్లో తనకు అవకాశమివ్వాలని నెల్లేపల్లెకు చెందిన టీడీపీ యాదవ సాధికార సమితి జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌యాదవ్ సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తిచేశారు. అమరావతిలో ప్రభుత్వవిప్ థామస్‌తో పాటు వెళ్లి సీఎంను కలిసి విన్నవించారు.

పంటల పరిశీలన

పెనుమూరు, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): కలవగుంట, పెనుమూరులో వేరుశెనగ, వరి పంటలను జిల్లా వ్యవసాయాధికారి మురళీకృష్ణ శనివారం పరిశీలించారు. ఈ-క్రాప్‌లో నమోదు చేశారు. ఏడీఏ ఉమా, పెనుమూరు వ్యవసాయాధికారి సుహర్‌లత, సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధుడి మృతి



చిత్తూరు అర్బన్, సెప్టెంబరు 27 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధుడు (60) శనివారం మృతి చెందాడు. ఈనెల 6వ తేదీన డీటీసీ వద్ద వెళుతుండగా వాహనం ఢీకొనడంతో గుర్తు తెలియని వృద్ధుడు గాయపడ్డాడు. ట్రాఫిక్ పోలీసులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడ మృతి చెందాడు. వివరాలు తెలిసినవారు ట్రాఫిక్ పోలీసులను సంప్రదించాలని సీఐ లక్ష్మీనారాయణ కోరారు.